# ప్రియబాంధవి

'పో స్ట్'...!

సైకిలు పైనుంచి క్రిందకు దిగకుండానే, రెండుకవర్లు కిటికీలోంచి లోపలకు పడేసి వెళ్ళిపోయాడు పోస్టుమాన్...

అందులో ఓ కవరు విజయవాడ నుంచి వచ్చింది... నా కథల పుస్తకం అచ్చువేసిన పబ్లిషర్ పంపిన చెక్కూ ఆ విషయం తెలియజేస్తూ రాసిన ఉత్తరమూ అందులో వున్నాయి.

రెండో కవరు కూడా చింపి, లోపల నుంచి కాగితం తీసి చదివాను, ఈ మధ్య ఓ మాస పత్రికలో వచ్చిన నా కథను ఒక దానిని మెచ్చుకుంటూ రాసిన ఉత్తరం అది! మరోసారి చదువుకున్నాను.

"... మాసపత్రికలో మీ కథ చదివాను. జీవితానికీ ప్రేమకీ చక్కని నిర్వచనం చెప్పారు మీరు ఆ కథలో... మీ కథలంటే నాకు చాలా ఇష్టం. మీరు రాసిన ఏ కథను ఏ పత్రికలో మిస్సవుతానో అనే భయంతో దాదాపు అన్ని పత్రికలూ తెప్పించి చదివే అలవాటు చేసుకున్నాను. ఆ మధ్యెప్పుడో మీ కథకు రెండో బహుమతి ఇచ్చిన పత్రికవాళ్ళు మీ గురించిన వివరాలు ప్రచురించారు. ఆ విధంగా మీ అడ్రస్ తెలుసుకోగలిగాను. చొరవ తీసుకుని రాస్తున్నాను... మీ కలం నుంచి మరిన్ని మంచికథలు రావాలని కోరుకుంటున్నాను... శలవు... ప్రియబాంధవి..."

తన రచనలకు పొగడ్త లభించినప్పుడు ఏ రచయితయినా పొంగిపోక మానడు. అలాంటి అనుభవమే నాకూ కలిగినట్టనిపించింది. ఆ ఉత్తరాన్ని అమ్మకూ. చెల్లాయికీ చూపించాను. వాళ్ళిద్దరూ నా ప్రయోజకత్వానికి మురిసిపోయారు. నాన్నకు మాత్రం ఆ ఉత్తరాన్ని చూపించలేదు. ఎందుకో నా కథలంటే ఆయనకు అంతగా రుచించవు... నా కథలే కాదు. ఇపుడిపుడు రాస్తున్న చాలా మంది రచయితల కథలు ఆయనసలు చదవరు. చదవటానికి తీరికావుండదు... ఎప్పుడూ క్లయింట్లూ – గొడవా... ఆయన ప్రపంచం ఆయనదే... ఎప్పుడైనా రావిశాస్త్రిగారి కథలుగానీ, కుటుంబరావుగారి కథలుగానీ, పత్రికల్లోవస్తే వీలు చేసుకొని, ఏ రాత్రో చదివేస్తారు. ఆ తర్వాత ఎప్పుడైనా డైనింగ్ టేబులు దగ్గర కథల ప్రస్తావన వచ్చినపుడు కథంటే రావి శాస్త్రిగారి ఫలానా కథలా వుండాలనీ – కుటుంబరావ్‌గారి ఫలానా కథలో శిల్పం అద్భుతంగా వుందనీ 'కాంప్లిమెంట్స్' ఇస్తారు....

అయితే నా రచనా వ్యాసంగానికి ఎక్కువగా ప్రోత్సాహాన్ని అందించే అపర్ణకు మాత్రం నేనురాసిన ప్రతి కథనూ-పత్రికకు పంపించటానికి ముందే చదివి వినిపించటం నాకు అలవాటు.

అపర్ణతో నా పరిచయం చాలా గమ్మత్తుగా జరిగింది.

నేను యూనివర్సిటీకి వెళ్ళే సమయంలోనే అపర్ణకూడా బస్‌స్టాప్ దగ్గర నిలబడేది... కొన్నాళ్ళు ఆమెను నేనంతగా పట్టించుకోలేదు. ఆ తరువాత ఒకనాడు, కొంతమంది కుర్రాళ్ళు ఆమెను ఆట పట్టిస్తూంటే, అప్రయత్నంగానే ఆమెను చూశాను. బాగా పొట్టిగా వుంది. ఆమె వేసుకున్న జడలు కూడా పొట్టిగానే వున్నాయి... చామనచాయరంగు... ముఖం మీద స్ఫోటకం మచ్చలు... కళ్ళకు బరువైన చత్వారంజోడు!... చిన్నతనంలోనే పోలియో వచ్చింది కాబోలు ఎడమకాలు సరిగాలేదు... వంకర తిరిగి పోయింది. ఆ కాలు మీద చేతిని బోటు పెట్టుకొని, అడుగుల్ని ఎత్తిఎత్తివేస్తూ నడుస్తోంది.

అలాంటి దురదృష్టవంతురాలినా - ఆ కుర్రాళ్ళు వేళాకోళం చేస్తున్నది?

ఆ అమ్మాయిపట్ల సానుభూతో, జాలో తెలియని అభిమానం నాలో నిండిపోయింది. దానితోబాటు ఆమెను మాటలంటున్న కుర్రాళ్ళపట్ల అసహ్యమూ కలిగింది. అలాంటి పరిస్థితిని అధారంగా తీసుకుని ఓ కథ రాయాలని అన్పించింది ఆ క్షణంలో... మంత్రాలకు చింతకాయలైనా రాల్తాయేమోగానీ మంచి కథలు మనుషుల్లో పరివర్తన తేగలుగుతాయా పిచ్చిగానీ?...

ఇంకోరోజు....

మామూలుగా నేను బస్‌స్టాప్‌లో నిలబడి వున్నాను.

నా ప్రక్కనే సిమ్మెంటు బెంచీమీద వేరుసెనక్కాయలు కొట్టుకుని తింటూ ఆ యిద్దరు కుర్రాళ్లూ కూర్చుని వున్నారు. ఇంతలోనే, అందులో ఒకడు -

"అదిగోరా! బస్‌స్టాప్ సుందరి వస్తోంది" - అన్నాడు.

దూరంగా చూశాను...

రోడ్డుకు అవతలి వైపునుంచి ఆ అమ్మాయి నెమ్మదిగా నడుస్తూ వస్తోంది. ఒక కాలిమీద చేయి అన్చి అతికష్టంగా నడుస్తోంది.

"వంకరకాలూ, భూతద్దాలూ తప్పితే అమ్మాయి ఫరవాలేదురా! అవయవాలన్నీ పిటపిటలాడుతూనే వున్నాయి". రెండోవాడు ఆమెను చూస్తూ అంటున్నాడు.

'ఛీ... ఛీ... ఒంటరిగావున్న ఆడ పిల్లను చూస్తే ఇలాంటి పైశాచిక ఆలోచనలను పొందే జులాయి కుర్రాళ్ళు మనదేశంలోనేనా, అన్ని దేశాలలోనూ వున్నారా?...' అనిపించింది.

"దానికి పెళ్ళవటం కష్టమేరా పాపం!" - అందులో ఒకడు మళ్ళీ అన్నాడు.

"కష్టమేమిట్రా? అలాంటివాడే ఎవడో ఎక్కడో పుట్టేవుంటాడు"-రెండోవాడి సమాధానం.

"అందం లేకపోయినా, ఆనందానికి లోటు రానీయదులే... పర్సనాలిటీ బాగుంది"– అప్పుడే అక్కడకు చేరుకున్న ఆ అమ్మాయి, వాళ్ళమాటల్ని బహుశా వినే వుండాలి...

వాళ్ళిద్దరూ ఇంకా వాగుతూనే వున్నారు.

"ఓ ఛాన్స్ అడిగి చూద్దామేమిటీ?" –

"ఒప్పుకుంటుందంటావా?" –

"మనకన్నా మొగాడు దొరుకుతాడంటావా?"–

ఆ 'కామెంట్స్' వింటూంటే నాలో రక్తం నాకు తెలియకుండానే మరిగిపోయింది. ఆవేశంతో నరాలన్నీ పొంగిపోయాయి. ఒక్క అడుగులో వెళ్ళి వాళ్లిద్దరిచొక్కాలూ పట్టుకున్నాను. నాకే తెలియని ఆవేశంలో, ఏం చేస్తున్నదీ తెలియని పరిస్థితుల్లో – వాళ్ళిద్దరి లెంపలూ – వాయించాను...

ఆ హఠాత్సంఘటనకు వాళ్ళిద్దరూ తృళ్లిపడి మళ్ళి తేరుకునేటంతలో – షాపులో వున్న మరో ఇద్దరు ముగ్గురు పెద్దమనుషులు మాచుట్టూ చేరారు.

జరిగిన విషయమంతా వాళ్ళకు చెప్పాను... వాళ్ళుకూడా ఆ కుర్రాళ్ళిద్దర్నీ ముక్క చివాట్లు వేశారు... ఆ అమ్మాయి సిగ్గుతో కన్నీళ్ళునింపుకుని నావైపు కృతజ్ఞతగా చూసింది.

ఆ మర్నాటినుంచీ ఆ కుర్రాళ్ళు నాకు కనిపించలేదు... కానీ మా యిద్దరి మధ్యా పరిచయం పెరిగింది..

మా యింటికి వెనుకనున్న వీధిలోనే వాళ్ళిల్లు... తన పేరు అపర్ణ అనీ, బి.ఏ., చదివాననీ చెప్పింది. ఉద్యోగ ప్రయత్నంలో వుందట. ఎందుకైనా మంచిదని టైపు కూడా నేర్చుకుంటోందట... రోజూ ఆ బస్సులోనే చౌరస్తాదగ్గరున్న టైపు ఇన్స్టిట్యూట్‌కి వెడుతోంది.

నేను కథలురాస్తానని తెలుసుకున్నప్పుడు ఆమెకళ్ళల్లో ఏదో మెరుపు మెరిసినట్లు నాకనిపించింది. తాను ఎన్నో నవలల్నీ నాటకాల్నీ చదివినట్లు చెప్పింది అపర్ణ....

అపర్ణ అప్పుడప్పుడు మాయింటికి వస్తూండేది... వీలయినప్పుడు నేనూ వాళ్ళింటికి వెళ్ళేవాణ్ణి... నేనురాసిన కథలు చదివి అభిప్రాయం చెప్పేది.... తనకేదైనా ఆలోచన వస్తే దాన్ని నాకు చెప్పి కథ రాయమనేది.

"నువ్వే రాయకూడదూ?" అంటే – "నేను మంచి విమర్శ చేయగలనేమో గానీ, మంచికథ రాయలేను" – అని నవ్వేసింది ఓసారి....

అలా రెండేళ్లలో అపర్ణ నాకు చాలా సన్నిహితురాలయింది. మా యింట్లో తానూ ఒక మనిషిగా అందరికీ ఆప్తురాలయింది... ఈలోగా రచయితగా నాకూ కొంత గుర్తింపు లభించింది. నేను రాసే ప్రతికథగురించీ ముందుగానే ఆమెతో చర్చించేవాడిని... నా కథలపై

ఎవరైనా అభిప్రాయాలు వెల్లడిస్తే, వాటిని మళ్లీ అపర్ణకుచెప్పి - దానిమీద చర్చించు కునేవాళ్లం....

ఆరోజు సాయంత్రం అపర్ణ వచ్చినప్పుడు - ఆ వుత్తరాన్ని చూపించాను.

"ఎవరీ ప్రియబాంధవి?" - ఉత్తరం పూర్తిగా చదివాక అడిగింది.

"ఏమో... నాకూ తెలియదు!... ఎవరైనా కలంపేరుతో రాశారేమో?"

"బహుశా ఆడపిల్లే అయివుండాలి!" ఉత్తరంలోని అక్షరాలవైపు చూస్తూ అంది.

"నేనూ అలాగే అనుకున్నాను! రైటింగ్ ఆడపిల్లల రైటింగ్ లాగనే వుంది" -

"ఎవరో అదృష్టవంతురాలు... నిన్ను బుట్టలో వేసుకోవాలని చూస్తోంది!" - ఓరగా చూస్తూ అంది. తేలిగ్గానవ్వేశాను.

"మరి జవాబు రాస్తావా?" - కొన్ని క్షణాల తరువాత అడిగింది అపర్ణ...

"రాసేవాడినే! కానీ తన అడ్రస్ ఇవ్వలేదు" - అన్నాను.

మళ్లీ పదిరోజులుపోయాక మరో ఉత్తరం వచ్చింది.

"... పది రోజులక్రితం నేను రాసిన వుత్తరం మీరు అందుకునే వుండాలి... అందులో నా అడ్రస్ ఇవ్వటం మరచి పోయాను. అందుకే ఈ వుత్తరం! అన్నట్టు ఈ దీపావళికి రెండు మూడు మాస పత్రికలు నవలల పోటీలు నిర్వహిస్తున్నట్టు మీరు గమనించే వుండాలి. ఎప్పుడూ కథలు రాసే మీ కలం నుంచి ఈసారి మంచి నవల రావాలనీ, దానికి బహుమతి లభించాలనీ కోరుకుంటున్నాను.... ప్రియబాంధవి...."

ఉత్తరంలో క్రింద కాలేజీ అడ్రస్ ఇచ్చింది. అడ్రస్‌లో తన పేరుకు ముందు 'మిస్' అని రాసుకుంది. బి.ఏ. ఫైనలియర్ చదువుతోందట...

సాయంత్రం అపర్ణకు మామూలుగా ఆ ఉత్తరాన్ని చూపించాను... చదివిన తరువాత ఆ ఉత్తరాన్ని నా మీదకు విసిరేసింది.

"ఇంకనేం?....అడ్రస్ ఇచ్చిందిగా మీ ప్రియబాంధవి! వెంటనే జవాబు రాసెయ్యి" మూతి ముడుచుకుంది.

"జెలసియా?" నవ్వుతూనే అడిగాను

"కాదు... ఆ అమ్మాయంటే నాకు ఎలర్జీ!"

"నో... జెలసీకి ఆ పేరు పెట్టుకుని నిన్ను నువ్వు మభ్యపరచుకుంటున్నావ్"

"ఆ అమ్మాయంటే ఈర్ష్య పడవలసిన అవసరం నా కేమిటీ? అయినా నీ మీద నాకు హక్కేముంది? నిన్ను నేను ప్రేమించానా? పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానా?... అలా అనుకోవటానికి అర్హత కూడా లేని అనాకారిని!"

"అయితే ఆ అమ్మాయిలో ఏం చూసి ఎలర్జీ నీకు? అసలు ఎప్పుడైనా ఆ అమ్మాయిని చూశావా? మాట్లాడావా?" అడిగాను

"నీకు మాత్రం ఆ అమ్మాయంటే అంత ఇష్టం ఎందుకూ? ఎందుకంత వెనకేసుకొస్తావ్? నువ్ మాత్రం ఆమెను చూశావా? మాట్లాడావా? ఏదో ఒక వుత్తరం ముక్క రాసిందని అంతగా పొంగిపోయి-దబ్బావాయించుకోవటం దేనికీ? నేను మాత్రం నీకథల్ని చదివి మెచ్చుకోవటం లేదా! నవలలు రాయమని ప్రోత్సహించటం లేదా?" ఉక్రోషం పుట్టిపడింది అపర్ణ మాటల్లో.

అపర్ణ అలా అడగటం నాకు బాధనిపించింది. ఆమెకు ఏం చెప్పాలో, ఎలానచ్చచెప్పాలో అర్థం కాలేదు.

"సరేలే! నీకు 'ఎలర్జీ' అంటున్నావ్ కనుక నాకు నేనుగా ఆ అమ్మాయి సంగతి నీ దగ్గర ఎపుడూ చెప్పను!" - నిష్ఠూరంగా అన్నాను.

ఈ సంఘటన జరిగిన తరువాత అపర్ణ మాయింటికి రావటం మానేసింది. బస్‌స్టాప్‌లో కూడా ఎప్పుడూ కనిపించలేదు.

ఓరోజు నేనే వాళ్ళింటికి వెళ్ళాను. అపర్ణ తమ్ముళ్ళిద్దరూ నన్ను లోపలకు ఆహ్వానించారు. వాళ్ళిద్దరూ కాలేజీలోచదువుతున్నారు. అపర్ణకు తండ్రిలేదు. తల్లి స్కూలుటీచరుగా పనిచేస్తోంది.

నేను వెళ్ళేసరికి ఆవిడ ఇంకా స్కూలు నించి ఇంటికి రాలేదు. నేను కూర్చున్న కొంతసేపటికి అపర్ణ కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది.

"ఈ మధ్య రావటం మానేశావే?" - అడిగాను కాఫీ తాగిన తర్వాత.

"నేనెందుకూ? నీ ప్రియబాంధవి వుందిగా ! కావాలంటే ఆవిడ్నే రమ్మని ఆహ్వానించు. రోజూవచ్చి నీ కథలకి ప్లాట్లు చెబుతుంది" -

అపర్ణ కళ్ళల్లోకి చూశాను... ఆ కళ్ళల్లో ఈర్ష్యా అసూయ లాంటివి కనిపించలేదు. భవిష్యత్తును గురించిన ఆవేదనో, ఆలోచనో వున్నట్టుగా అనిపించింది.

"ముక్కూ ముఖం చూపించని ఆ అమ్మాయి గురించి మనిద్దరం ఇలా కోపతాపాలు తెచ్చుకోవటం మంచిది కాదు.. మూర్ఖత్వం అనిపించు కుంటుంది" -

"అవును! నేను మూర్ఖురాలినే! నీ దయవల్ల ఈ సత్యాన్ని చాలా త్వరగా గ్రహించగలిగాను" - కోపంగా అంది అపర్ణ.

నేనేం మాట్లాడినా సరిగా అర్థం చేసుకునే పరిస్థితుల్లో అపర్ణ లేదు. పైగా ప్రతి మాటకీ విపరీతార్థాలు తీస్తోంది. ఆ మాటే అన్నాను - "నువ్ నన్ను అనవసరంగా అపార్థం చేసుకుంటున్నావ్! మన స్నేహం నిన్న మొన్నటిది కాదు అపర్ణా. నేను నిన్ను ఎంతగా

అభిమానిస్తున్నానో నీ కర్థం కాదు. నాలుగురోజులు నువ్ కనపడకపోతే నాప్రాణం ఎంతగా విలవిల్లాడుతుందో విడమరచి చెప్పలేను! అందుకే ఎంతో ఆరాటంతో ఇవాళ నీకోసం ఇలా పరుగెత్తుకుంటూ వచ్చాను... ఈ నాలుగు రోజుల్నుంచీ కాగితం మీద కలం పెట్టాలని కూడా అనిపించలేదు" - నా మాటలు వింటూ నా కళ్ళల్లోకి తమకంగా చూసింది అపర్ణ....

నా కుడిచేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుని-అభిమానం వుట్టిపడేస్వరంతో అంది-

"నాకు తెలుసు రాజూ! నేనంటే నీకు చాలా ఇష్టం... మనిషిగా పుట్టినందుకు నీ స్నేహసంపద ఒక్కటే నాకు అదృష్టంగా లభించింది. ఎడారి వంటి నా జీవితానికి నీ అభిమానం, అదరణా సేదదీర్చే మలయమారుతాలయ్యాయి. ఇంతకంటే ఈ అవిటిదానికి కావల్సిందే ముంటుందీ?" - అపర్ణ కళ్ళల్లో మెరిసిన కన్నీరు నన్ను కదిలించింది.

బరువెక్కిన హృదయంతో ఇంటికి వచ్చేశాను.

అప్పటినుంచీ అపర్ణ మా యింటికి రావటం పూర్తిగా మానేసిందనే చెప్పాలి. ప్రియబాంధవి నుంచి మాత్రం అప్పుడప్పుడు వుత్తరాలు అందుతూనే వున్నాయి. వాటికి సమాధానం రాసేటప్పుడల్లా ఆమెను చూడాలనే కోరిక కలిగేది.

యూనివర్శిటీలో నా క్లాస్‌మేట్ విశ్వనాధానికి ఓ తమ్ముడున్నాడు. అతను కాలేజీలో బి.ఎ. ఫైనలియర్ చదువుతున్నాడు... అతని ద్వారా ప్రియబాంధవిని గురించిన సమాచారం దొరుకుతుందనే ఆశతో ఓసారి ప్రయత్నించాను.

అసలు ఆపేరు గల అమ్మాయెవరూ తన క్లాసులో లేదని చెప్పాడతను...

అయితే ఎవరైనా కలం పేరుతో రాస్తూండాలి...!

వేసవి శలవలకు కాలేజీ మూసేస్తారనగా - ప్రియబాంధవి నించి మళ్ళీ మరో వుత్తరం వచ్చింది..

"... ఎల్లుండి నుంచీ కాలేజీ మూసేస్తున్నారు. శలవలు మూడునెలలూ గడపటానికి మా అత్తయ్యగారి ఊరు వెడుతున్నాను. మా అత్తయ్యగారబ్బాయి మెడిసిన్ చదువుతున్నాడు. అతనూ శలవలకు ఇంటికొస్తాడు. ఈ శలవల్లో మా పెళ్ళి చేసేయాలని మా పెద్దవాళ్ళ సంకల్పం. కానీ బావను చిన్నప్పట్నించీ ఒకబంధువుగానే చూడగలిగాను కానీ, ఆత్మబంధువుగా చూడలేక పోయాను... అయినా మనసుకు నచ్చిన వ్యక్తితో మనువు కుదిరే అదృష్టం ఏ కొద్దిమందికో తప్ప అందరికీ దొరకదు... దొరికినదానితో తృప్తిపడే మనస్తత్వాన్ని అలవాటు చేసుకుని జీవితంతో రాజీపడటం నేర్చుకోవాలని అనుకుంటున్నాను" అంటూ రాసింది.

ఉత్తరం చదివిన తరువాత ఆమె మనోభావాల్ని కూడా చదవటానికి ప్రయత్నించాను. మనసుకి నచ్చిన వ్యక్తిని మనువాడటంలో ఎంతో సంతృప్తి వున్నదని రాసింది. అంటే ఆమె

మనసుకు నచ్చిన వ్యక్తి వేరే ఎవరో వుండి వుండాలి! ఈ విషయం నాకెందుకు రాయాలి?.... ఒకవేళ నన్ను కోరుకోవటంలేదు కదా?

ఏమో?... అభిమానమనేది ఎలా పుడుతుందో, ఎందుకు పుడుతుందో చెప్పలేం!

మరికొన్నాళ్ళు గడిచాయి.... నేను పరీక్షల హడావిడిలో వున్నాను. సరిగ్గా అప్పుడే - ఓ సాయంత్రం అపర్ణ, వాళ్ళ తమ్ముడిచేత కబురు పెట్టింది - ఓసారి వాళ్లింటికి రమ్మని...

వెంటనే వెళ్ళాను.

లోపల గదిలో మంచం మీద పడుకుని వుంది అపర్ణ... ఆదుర్దాగా దగ్గరకు వెళ్ళి - మంచం దగ్గరగా కుర్చీలాక్కుని కూర్చున్నాను.

"నాలుగు రోజులనుంచీ ఒంట్లో బాగుండటంలేదు" అంది.

"జ్వరమా?... మరి నాకు వెంటనే కబురు చేయలేదేం?" అపర్ణ వైపు చూస్తూ అడిగాను. మనిషి చాలా నీరసంగా వుంది. కళ్ల క్రింద నల్లటి చారలు కనిపిస్తున్నాయి.

"నీకు పరీక్షలు కదా! ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక వూరుకున్నాను" అపర్ణ మాటలు నిర్లిప్తంగా వున్నాయి. కళ్లల్లో జీవంలేదు.

"మీ ప్రియబాంధవి నుంచి ఉత్తరాలు వస్తున్నాయా?"- కొన్ని నిముషాల తర్వాత అడిగింది, నా వైపు కొంటెగా చూసి...

అపర్ణతో అబద్ధం చెప్పటానికి నామనసు అంగీకరించదు. అందుకే అప్పటి ఉత్తరంగురించీ, అందులోని విషయాల గురించీ చెప్పాను...

"ఒకవేళ ఆవిడగారు నిన్ను ప్రేమిస్తున్నదేమో అడక్కపోయావా?" - అంతా విన్న తరువాత అడిగింది.

"నాకూ ముందు అలాగే అనిపించింది... కానీ ఒక్కసారైనా నన్ను చూడకుండా, నాతో మాట్లాడకుండా, నా మనసు తెలుసుకోకుండా నన్ను ప్రేమించి వుంటుందని ఏలా అనుకోవాలి?"

"నీ ఉత్తరాలద్వారానే నిన్ను చూస్తూ నీతో మాట్లాడుతూ, నీ మనసు తెలుసుకుని వుండాలి"! నవ్వేసింది అపర్ణ.

అపర్ణ అలా నవ్వుతూంటే నా మనసంతా తేలికయినట్లు అనిపించింది. ఆత్మీయతలోని అంతరార్థం అదేననుకోవాలి....

"అంతగా అర్థంచేసుకున్న మనిషయితే, నన్ను ప్రేమిస్తున్నట్లు డైరక్టుగానే రాయొచ్చుగా!"

"ఏమో? ఆడపిల్లకు ఆ మాత్రం సిగ్గు వుండకూడదనా?"

నేను మరి జవాబు చెప్పలేదు... కొన్ని క్షణాల తరువాత అపర్ణ మళ్లీ అడిగింది.

"ఆమెను పెళ్లిచేసుకోవటం నీకు ఇష్టమేనన్నమాట!" అని.

"నా మనసు తెలుసుకొని, నాతో సహకరిస్తానంటే ఆమెను తప్పకుండా నా జీవితంలోకి ఆహ్వానించగలిగే ధైర్యం నాకుంది!.... సమాజానికి పనికి వచ్చే రచయితగా నన్ను నిలబెట్టటంలో తాను చేయూతనివ్వాలి!... నా కథలకూ కల్పనలకూ ఊపిరిపోయాలి!... నా ఉత్సాహానికి ఆమె ప్రోత్సాహం ఇవ్వగలగాలి!" చెప్పాను

"అయితే అమ్మాయి అందంగా లేకపోయినా ఫర్వాలేదా?"

"బాహ్య సౌందర్యాన్ని నేను కోరుకోను ! మనసులోని అందం కావాలి! శరీరంలోని సౌందర్యం కాదు కావాల్సింది! హృదయంలోని సౌందర్యాన్ని కోరుకుంటాను" –

నా మాటలకు అపర్ణ బిగ్గరగా నవ్వేసింది...

"హృదయ సౌందర్యం వున్న అమ్మాయి అనాకారయినా, కురూపయినా, ఆఖరికి కుంటిదయినా చేసుకుంటావా?" – అలా నవ్వుతూనే అడిగింది.

ఉలిక్కిపడి చూశాను... నవ్వుతున్న అపర్ణ కళ్ళల్లో కన్నీరు మెరుస్తోంది.

"రాజూ! నన్ను క్షమించు రాజూ!" – అంతలోనే అవతలవైపు తిరిగి ముఖాన్ని రెండు చేతులలోనూ దాచుకుని – వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"ఏమిటిది అపర్ణా ! ఏమయింది?" – అదుర్దాగా అడిగాను.

"నీకు ఇన్నాళ్ళూ, ఆ పేరుతో ఉత్తరాలు రాసింది నేనే రాజూ! – నన్ను క్షమించు"! – నా చేతులు పట్టుకుంటూ అంది.

"ప్రియబాంధవి పేరుతో ఉత్తరాలు రాస్తున్నది నువ్వా?"–ఆశ్చర్యపోతూ అడిగేను.

"అవును రాజూ! నేనే రాశాను! నిజజీవితంలో లేని మనశ్శాంతినీ సంతృప్తినీ – ఊహల్లోనైనా పొందాలనే దురాశతో అలా చేశాను" –

అపర్ణ చెబుతున్నది అర్థం చేసుకోవటాన్కి ప్రయత్నిస్తున్నాను...

"నేను అవిటిదాన్ని రాజూ! పైగా అందంలేనిదాన్ని!... నన్ను చూసి అసహ్యించుకునేవారే కానీ, అభిమానంతో పలకరించేవారు, నా జీవితంలో నాకు తారసపడలేదు. కాలేజీలో చదువుకునేటప్పుడు ఎంతో మంది అబ్బాయిలు అమ్మాయిల వెంటపడేటప్పుడూ – ప్రేమలేఖలు రాసేటప్పుడూ, నాకు ఈర్ష్యకంటే ఆవేదనే కలిగేది... సరిగ్గా అప్పుడే నాలో ఒక భయంకరమైన వ్యాధి కూడా బయల్దేరింది" – చెప్పటం ఆపి తన మునివేళ్ళతో కళ్ళుతుడుచుకుంది.

"వ్యాధా?"

కథా నిలయం
6053
శ్రీకాకుళం

"అవును రాజూ! బ్రెస్ట్‌క్యాన్సర్! ఇంత చిన్న వయసులో ఎందుకొచ్చిందో తెలీదు.. కానీ ఈ వ్యాధి నన్ను ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా - ఈ ప్రపంచం నుంచి దూరం చేస్తుందని నాకు తెలుసు!" -

"అపర్ణా! " ఆమెను వారిస్తూంటే నా గొంతులో దుఃఖం అడ్డుపడింది.

"అదీ ఒక అదృష్టమే అనుకున్నాను రాజూ! ఈ జబ్బు లేకపోతే నా పెళ్లి మా అమ్మకు ఓ సమస్య అయ్యేది. అదికాస్తా ఈ జబ్బుతో తీరిపోయింది నేను అట్టే కాలం బ్రతకనని అమ్మకూ డాక్టర్లకే కాదు, నాకూ తెలుసురాజూ!... అయితే చచ్చిపోయేలోగా నేనూ ఒక వ్యక్తి చేత ప్రేమించబడాలనే తపనతో - నీకు అలా ఉత్తరాలు రాశాను... ఊహల్లో జీవించాలని ఉబలాటపడ్డాను..."

"మరి నువ్ కాలేజీలో చదవటం లేదు కదా - నేను కాలేజీ అడ్రస్‌కి రాసే ఉత్తరాలు నీ కెలా అందేవి?" -

"కాలేజీ స్టూడెంట్స్‌కి వచ్చే ఉత్తరాలన్నీ ప్రిన్సిపాల్ రూమ్ దగ్గర డబ్బాలో పడేస్తాడు పోస్ట్‌మాన్... తమ్ముళ్ళకు చెప్పాను, ప్రియబాంధవి అనే పేరుతో వచ్చే ఉత్తరాలను తీసి నాకు తెచ్చివ్వమన్నాను. వాళ్లు అలాగే చేసేవారు... ఇక నీకు 'ప్రియబాంధవి' ఉత్తరాలు రాయదని చెప్పటానికే ఇప్పుడు నిన్ను పిలిచాను రాజూ!"

అయోమయంగా అపర్ణవైపు చూశాను.

"అవును రాజూ! నేను ఇవాళే హైదరాబాద్ వెళ్లిపోతున్నాను. నాలుగయిదురోజుల్లో ఆపరేషన్ చేస్తారు... మళ్లీ బ్రతికి బయటపడి ఇక్కడకు వస్తానో రానో నాకే తెలియదు! ఒకవేళ నేను చచ్చిపోతే - నీకు ఉత్తరాలు అందకపోతే - నువ్ కంగారు పడతావేమోనని చెప్పటానికే పిలిచాను! నీ మనసు కష్టపెట్టివుంటే నన్ను క్షమించురాజూ!" - నా రెండుచేతుల్నీ తీసుకుని తన చెక్కిళ్ళకు రాసుకుంది.

నామనసు మూగపోయింది...

"నువ్ క్షేమంగా తిరిగి వస్తావ్ అపర్ణా!... వచ్చాక నిన్ను పెళ్లిచేసుకుని నాదాన్ని చేసుకుంటాను. మనిషికి కావల్సింది అభిమానించే మనసే కానీ ఆకర్షించే అందంకాదనీ నలుగురికీ తెలియచేస్తాను"... అని ఆమెతో చెప్పాలనుకున్నాను.

నా గొంతులో అడ్డుపడిన దుఃఖం ఆ మాటల్ని చెప్పనివ్వలేదు.

మూగబోయిన గొంతుతో, కన్నీటి పొరలు కమ్మిన కళ్ళతో, బరువెక్కిన గుండెతో - బయటకు వచ్చేశాను!

కథా నిలయం 6053.

(స్వాతి మాసపత్రిక)